ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
శనివారం 10 అక్టోబర్ 2026





## దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సింగరేణి, మున్సిపల్, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

9 లో



# వీధి కుక్కల స్వైరవిహారం

- రోజురోజుకూ పెరుగుతున్న శు నకాల బెడద
- రహదారులపై గుంపులుగా తిష్ట..
- ద్విచక్ర వాహనదారులపై దాడులు
- పిల్లలు బయటకు పంపాలంటేనే తల్లిదండ్రుల ఆందోళన
- తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్

రామడుగు మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో వీధి కుక్కల సంచారం తీవ్రరూపం దాల్చింది. రోజురోజుకూ శునకాల బెడద మితిమీరిపోతుండటంతో గ్రామస్తులు భయాందోళనల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. వీధివీధినా గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై విరుచుకుపడుతుండటంతో ఊరంతా భయానక వాతావరణం నెలకొంది

మిగతా 2 లో

## పేదలకు మెరుగైన వైద్యం..

- వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో మోకాళ్ల ఆపరేషన్లకు సీ-ఆర్మ్ మిషన్
- వినికిడి పరీక్షల కోసం వినియోగంలోకి వచ్చిన బేరా యంత్రం
- అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సదుపాయం
- 9వ పోషణ మాసం ముగింపు సభలో ప్రభుత్వ విప్ ఆది, కలెక్టర్



4లో

## అమరుల ఆశయాల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం

- ఆకుల భూమయ్య హత్యపై సమగ్ర విచారణ జరిపించాలి
- తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకుల డిమాండ్



3లో



14లో

## కళ్లు తెరిచి కరెంటు, నీళ్లు ఇవ్వకపోతే సబ్‌స్టేషన్ల ముట్టడి!

- రైతులను కాపాడే వరకు విశ్రమించకుండా పోరాటం చేస్తాం
- కాలయాపనకే మంత్రితో ఫోటోలు దిగుతున్న దుద్దిళ్ల
- కాంగ్రెస్‌కు దోపిడి మీద ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదు

## మేడారం రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం గుట్టు రట్టు

- 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు
- మిల్లు యజమాని సహా ముగ్గురిపై కేసు నమోదు



10లో



# వీధి కుక్కల స్వైరవిహారం

## బిక్కుబిక్కుమంటున్న గ్రామస్తులు

- రోజురోజుకూ పెరుగుతున్న శునకాల బెడద
- రహదారులపై గుంపులుగా తిష్ట..
- ద్విచక్ర వాహనదారులపై దాడులు
- పిల్లలు బయటకు పంపాలంటేనే తల్లిదండ్రుల ఆందోళన
- తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్




**రామడుగు, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)**
రామడుగు మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో వీధి కుక్కల సంచారం తీవ్రరూపం దాల్చింది. రోజురోజుకూ శునకాల బెడద మితిమీరిపోతుండటంతో గ్రామస్తులు భయాందోళనల నడుమ కాలం వెళ్లదీస్తున్నారు. వీధివీధినా గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై విరుచుకుపడుతుండటంతో ఊరంతా భయానక వాతావరణం నెలకొంది

**రోడ్లపై తిష్ట.. పాదచారులపై దాడి యత్నాలు**

గ్రామంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్ పరిసరాలు, ఆలయ ప్రాంగణాలు, పాఠశాలల మార్గాల్లో పదుల సంఖ్యలో కుక్కలు తిష్ట వేస్తున్నాయి. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే పాదచారులు, మహిళలు, వ్యవసాయ పనులకు వేకువజామునే వెళ్లే రైతులను లక్ష్యంగా చేసుకుని వెంటపడుతున్నాయి. దారిన పోయే వారిపైకి ఒక్కసారిగా దూసుకువస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**వణుకుతున్న చిన్నారులు, వృద్ధులు**

పాఠశాలలకు, ట్యూషన్లకు వెళ్లే చిన్నపిల్లల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. రోడ్లపై కుక్కల గుంపులు ఉండటంతో పిల్లలను పాఠశాలలకు ఒంటరిగా పంపించేందుకు తల్లిదండ్రులు తీవ్రంగా జంకుతున్నారు. ఇంటి ముంగిట్లోకి కూడా చొరబడుతుండటంతో వృద్ధులు, మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. రాత్రి వేళల్లో కుక్కల వికృత అరుపులతో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

**వాహనదారులకు తప్పని ప్రమాదాలు**

ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు తీవ్రంగా వేధిస్తున్నాయి. బైక్‌లు కనపడగానే వెంబడించి మొరగడం, కరవడానికి ప్రయత్నించడం నిత్యకృత్యంగా మారింది. వీటి బారిన పడకుండా తప్పించుకునే క్రమంలో వాహనదారులు అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. రాత్రి వేళల్లో గ్రామంలోకి కొత్తవారు లేదా బంధువులు రావాలంటేనే వణికిపోయే దుస్థితి దాపురించింది.

**అధికారుల ఉదాసీనతపై ఆగ్రహం**

గ్రామంలో శునకాల సంతతి నియంత్రణకు గానీ,



వాటిని పట్టుకోవడానికి గానీ గ్రామ పంచాయతీ యంత్రాంగం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. సమస్య తీవ్రతపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి**

ఏదైనా ఊహించని పెద్ద ప్రమాదం జరిగి పసిపిల్లల ప్రాణాలకు ముప్పు వాటిల్లకముందే అధికార యంత్రాంగం మేల్కోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల పరిషత్, పంచాయతీ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపి, ప్రత్యేక బృందాలతో గోపాలరావుపేటలో కుక్కలను బంధించి గ్రామస్తులకు శునకాల బెడద నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## గౌతమ్ మోడల్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**కోరుట్ల, అక్టోబర్ 09 ప్రజాజ్యోతి**
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, ప్రత్యేక అతిథిగా నాగులపేట సర్పంచ్ గంగాజల పాల్గొని విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని వివరించారు.



## కేరళ హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

**కోరుట్ల, అక్టోబర్ 09 ప్రజాజ్యోతి**
కోరుట్ల పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుంచి పదవ తరగతి వరకు విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఏ. బారి, ప్రిన్సిపల్ సెలెన్ బారి లు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. విద్యార్థులు మన సంస్కృతి గొప్పతనాన్ని తెలుసుకొని భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం.ఏ. హాది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# అమరుల ఆశయాల సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం

- ఆకుల భూమయ్య హత్యపై సమగ్ర విచారణ జరిపించాలి
- తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకుల డిమాండ్



**పెద్దపల్లి ప్రతినిధి అక్టోబర్ 9 ప్రజా జ్యోతి:** అమరవీరుల ఆశయాల సాధన, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన ఆకుల భూమయ్య హత్యపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ప్రజా ఫ్రంట్ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ 2010 అక్టోబర్ 9న గద్దర్ తొలి అధ్యక్షుడిగా ఏర్పడిన తెలంగాణ ప్రజా ఫ్రంట్ పౌర ప్రజాస్వామిక హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, భూమి, నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో గద్దర్, ఆకుల భూమయ్య, పులిమామిడి మద్దిలేటి, కనకాచారి తదితరుల పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడినా అమరవీరుల ఆశయాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ, ఐడీపీఎల్ పరిశ్రమలను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, కౌలు రైతులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడంతో పాటు దళిత కుటుంబాలకు ఐదెకరాల భూమి, సాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థులు, యువకులు, కార్మికులు, రైతులు, ప్రజా సంఘాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలకు ఇచ్చిన ఇతర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, భూమి, కార్మిక హక్కుల సమస్యల పరిష్కారానికి ప్రజా సంఘాలతో కలిసి విస్తృత ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, సాగునీటి సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో పాటు ప్రభుత్వ పథకాలు, రుణాలు, పంటల బీమా ప్రయోజనాలు అందేలా చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని, పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్ మాట్లాడుతూ విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, ప్రతి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టి అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామిక హక్కులను పరిరక్షిస్తూ నిర్బంధ చట్టాలను రద్దు చేయాలని, తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని కోరారు.

కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె. విశ్వనాథం, రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం, పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డి రాజుల సంపత్, రైతు కూలీ సంఘం (ప్రజాపంథా) జిల్లా అధ్యక్షుడు ఎల్. భీమన్న, కునారం భూసాధన సమితి కన్వీనర్ గూళ్ల రాజన్న తదితరులు మాట్లాడారు. అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ యాకూబ్ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కమిటీ సభ్యులు కె. రాజు, కాంపల్లి అంజయ్య, దస్తగిరి, మోహన్, రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బండారి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మేధో వైకల్య విద్యార్థుల హక్కులకు భరోసా

### సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్




**కరీంనగర్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి )** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని మనోవికాస్ కేంద్రంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం, న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ హాజరై విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు తల్లిదండ్రులకు న్యాయపరమైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధో వైకల్యం ఉన్న విద్యార్థులకు విద్య, శిక్షణ, కుటుంబ ప్రోత్సాహం, సమాజ సహకారం అందిస్తే అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. పిల్లల పట్ల జాలి కంటే గౌరవం, సమానత్వం, ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం--2016, విద్యా హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించారు. అవసరమైన వారు న్యాయ సేవా సదన్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, వైద్యులు, మనోవికాస్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గానికి బండి సంజయ్ అభినందనలు

**కరీంనగర్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గంగా ఎన్నికైన సభ్యులు శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల ద్వారా నూతనంగా ఎంపికైన చైర్మన్ సంగెం లక్ష్మణరావు, వైస్ చైర్మన్ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, చీఫ్ అడ్వైజర్ పెండ్యాల కేశవరెడ్డి, ట్రెజరర్ గోనె శ్రీనివాస్ మరియు ఇతర ఈసీ సభ్యులకు మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని, మానవతా దృక్పథంతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



# పేదలకు మెరుగైన వైద్యం..

## చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



- వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో మోకాళ్ల ఆపరేషన్లకు సీ-ఆర్మ్ మిషన్
- వినికిడి పరీక్షల కోసం వినియోగంలోకి వచ్చిన బేరా యంత్రం
- అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ సదుపాయం
- 9వ పోషణ మాసం ముగింపు సభలో ప్రభుత్వ విప్ ఆది, కలెక్టర్



**వేములవాడ, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు చిన్నారుల్లో పోషకాహార లోపం, పుట్టుకతో వచ్చే సమస్యలను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం వేములవాడ ఏరియా ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ఆయన, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ సందర్భంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు నిర్వహించి, ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినికిడి పరీక్షల 'బేరా యంత్రాన్ని' వినియోగంలోకి తీసుకువచ్చారు.

### మోకాళ్ల ఆపరేషన్లకు సీ-ఆర్మ్ మిషన్

వేములవాడ వంద పడకల ఆసుపత్రిలో పేదలకు ఉచితంగా మోకాళ్ల శస్త్రచికిత్సలు చేయడానికి అవసరమైన సీ-ఆర్మ్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన పేదలందరికీ ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.

### పిల్లల ఎత్తు, బరువు క్రమం తప్పకుండా నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి నెలా ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువెళ్లి ఎత్తు, బరువు నమోదు చేయించాలని, దానికి అనుగుణంగా బాలామృతం, ఇతర పోషకాహారాన్ని అందించాలని సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో వైకల్యం, మానసిక సమస్యలు, నడవలేకపోవడం, రక్తహీనత వంటి లోపాలు ఉంటే వెంటనే అంగన్‌వాడీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ఆర్బీఎస్‌కే వాహనం ద్వారా ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. గతంలో ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు నిలిచిపోయిన బేరా యంత్రానికి ఇప్పుడు ప్రత్యేక గదిని కేటాయించి సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ఆర్డీఓ కేఎస్సీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో వినికిడి లోపం, మాటలు రాకపోవడం, శారీరక ఎదుగుదల సమస్యలు ఉంటే ప్రారంభంలోనే గుర్తించి హైదరాబాద్‌లోని నిమ్స్, సరోజినీదేవి, ఈఎన్‌టీ ఆసుపత్రులకు పంపించి మెరుగైన ఉచిత వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు విద్యుత్ భారం లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వెల్లడించారు.

---

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గాలిపల్లి విద్యార్థినులు ఎంపిక



కేశవేణి అన్విత



ఎంద్ర సంజన

**ఇల్లంతకుంట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ఇల్లంతకుంట మండలం గాలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు కేశవేణి అన్విత, ఎంద్ర సంజన రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం మేకల పావని, పీఈటీ సాన బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ నిర్వహించిన ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి వీరు ఈ అవకాశం సాధించినట్లు వెల్లడించారు. ఈ నెల 10 నుంచి 12 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను సర్పంచ్ బద్ధం శేఖర్ రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బట్టు పద్మ, ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్తులు అభినందించారు.

---

## ప్రగతి పాఠశాలలో పూల పండుగ సందడి

**- బతుకమ్మల పేర్పు.. కోలాటాలతో విద్యార్థుల కోలాహలం**

**రామగిరి,అక్టోబర్ 09(ప్రజాజ్యోతి) :** తెలంగాణ పల్లె సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు సెంటినరీ కాలనీలోని ప్రగతి పాఠశాలలో సందడిగా సాగాయి. ముందస్తుగా నిర్వహించిన ఈ సంబరాల్లో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ కోలాటాలు ఆడారు. చిన్నారుల ఉత్సాహం, రంగురంగుల పూల అలంకరణలతో పాఠశాల ప్రాంగణం పండుగ కళను సంతరించుకుంది.




చదువుతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించడంతో పాటు మహిళల ఐక్యత, ఆత్మీయతను చాటిచెబుతుందని పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి కొప్పుల గోవర్ధన్ రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు బీజేపీ ఘన సన్మానం

ఇల్లంతకుంట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):
ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తలను భారతీ-య జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా సీనియర్ నాయకురాలు కొలనూరు ముత్తవ్వ శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు భూమాల అనిల్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మారవేణి దివ్య ముఖ్య అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది సేవలను కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం మరియు పోషకాహారం కోసం అంగన్వాడీ కార్యకర్తలు అందిస్తున్న



సేవలు ఎంతో విలువైనవని ముత్తవ్వ పేర్కొన్నారు. వారి కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని కోరిన ఈ కార్యక్రమంలో బీజేపీ, మహిళా మోర్చా నాయకులు బోయిన్ రంజిత్, గుంటి వేణు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలనినో పరిస్థితుల్లో కూరగాయల సాగుతో అధిక ఆదాయం

### రోజుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఆర్జిస్తున్న రైతు మహేందర్

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 9, ప్రజా జ్యోతి:
ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. పెద్దకల్వల గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు బుసనవేణ మహేందర్ సుమారు రెండు ఎకరాల్లో బీరకాయ, కాకరకాయ, సొరకాయ, దోసకాయ, టమాటా సాగు చేస్తూ రోజుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదాయం



పొందుతున్నారని తెలిపారు. వరి వంటి పంటలతో పోలిస్తే నీటి లభ్యతకు అనుగుణంగా కూరగాయల సాగు చేయడం ద్వారా నీటిని పొదుపు చేసుకోవడంతోపాటు తరచుగా ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా తీగజాతి కూరగాయలకు వెదురు కర్రల ఆధారం, శాశ్వత పందిళ్లు, మల్చింగ్ షీట్లు, కూరగాయల నారు, డ్రిప్ పరికరాలపై నిబంధనల మేరకు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో రైతులు తమ భూమి, నీటి లభ్యతకు అనుగుణంగా కూరగాయల సాగును చేపట్టి ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఉద్యానవన అధికారి ఎస్. మహేష్, విస్తరణ అధికారులు బి. రాము, బి. మహేష్, సిగ్నెట్ ఇరిగేషన్ కంపెనీ డీసీఓ బి. మనోహర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# సమరభేరి సభకు తరలివెళ్లిన మంథని బీఎస్పీ శ్రేణులు



రామగిరి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :
బహుజనుల రాజకీయ చైతన్యం, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా వరంగల్‌లో నిర్వహించనున్న సమరభేరి సభకు మంథని నియోజకవర్గ బీఎస్పీ నాయకులు తరలివెళ్లారు. బీఎస్పీ వ్యవస్థాపకులు మాన్య కాన్షీరాం 20వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సభకు హాజరయ్యేందుకు శుక్రవారం రామగిరి మండలం కల్వచర్ల నుంచి నాయకులు బయలుదేరారు. బహుజన ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కోశాధికారి పులిపాక బొంద్యాలు, నియోజకవర్గ అధ్యక్షుడు జనగామ రవికుమార్, ఉపాధ్యక్షుడు ఏట సంపత్, రామగిరి మండల ఉపాధ్యక్షుడు ఇరుగురాల సదానందం, కమాన్‌పూర్ మండల ఉపాధ్యక్షుడు గజ్జల సురేష్‌తో పాటు నాయకులు చిలుముల రమేష్, అసన్ సతీష్, సీనియర్ నాయకుడు పేగ నరేష్, కాజీపేట స్వామి, మారేపల్లి రవికుమార్, ఉప్పులేటి పర్వతాలు, జనగామ మల్లేష్, సుందిళ్ల సంతోష్, దుబాసి రవి తదితరులు పయనమయ్యారు.

# శ్రీ కృష్ణవేణి హై స్కూల్లో బతుకమ్మ వేడుకలు

చొప్పదండి, అక్టోబర్ 9, (ప్రజాజ్యోతి):
శ్రీ కృష్ణవేణి హైస్కూల్లో శుక్రవారం బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రకృతి సౌందర్యానికి సాంప్రదాయానికి చిహ్నమైన ఈ పండుగను పురస్కరించుకుని విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి రంగు రంగుల పూలతో అందాల బతుకమ్మలను తయారు చేసుకున్నారు. తదనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ శైలిలో ఎత్తుకొని బతుకమ్మ పాటలు పాడుతూ భక్తి శ్రద్ధలతో పాటలు పాడారు. విద్యార్థుల స్పందన ప్రశంసనీయంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి తరానికి మన సంప్రదాయాలను, సంస్కృతిని అలవర్చడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఇంచార్జ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసిన సర్పంచ్

ఇల్లంతకుంట అక్టోబర్ 9, (ప్రజా జ్యోతి) :
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో దసరా పండుగ సందర్భంగా శుక్రవారం రోజు సర్పంచ్ కమటం లావణ్య రాములు. గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డమీది పద్మ, కార్యదర్శి పులి సంధ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలకు ఆత్మీయ సన్మానం

ముస్తాబాద్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ముస్తాబాద్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలను బీజేపీ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యతో పాటు మహిళా సంక్షేమం కోసం సేవలందిస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా శాలువాలతో పొగడ్తలతో ముంచెత్తారు. సమాజ అభివృద్ధిలో అంగన్‌వాడీ సిబ్బంది పాత్ర కీలకమని, వివిధ వర్గాల విశిష్ట సేవలను గుర్తించి గౌరవించేందుకే ఈ సేవా సంకల్ప్ అభియాన్ చేపడుతున్నట్లు నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు సంతోష్ రెడ్డి, నాయకులు మీస సంజీవ్, ఎదునూరి గోపికృష్ణ, ఇతర బూత్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిజిటల్ సర్పంచ్ శక్తిగా రమాదేవి

ఎలిగేడు అక్టోబర్ 09, (ప్రజా జ్యోతి):
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ సర్పంచ్ శక్తిగా కార్యక్రమానికి ఎలిగేడు మండలంలోని ర్యాకల్ దేవ్ పల్లి గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మద్దెల రమాదేవి సంపత్ మాట్లాడుతూ. డిజిటల్ సర్పంచి శక్తి చాలా విషయాలపై అవగాహన పెంచుకుంటూ ప్రజలకు మరింత అభివృద్ధికి సహకరించి ప్రభుత్వ సూచన మేరకు పనులు చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి 200 మంది సర్పంచులు దరఖాస్తు చేసుకోగా, 40 మంది మాత్రమే ఎంపికయ్యారు వీరికి ఈనెల 8 నుంచి పలు అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మండల సర్పంచులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



# దుర్గామాత ఆగమన్ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**వేములవాడ, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** దుర్గా నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతనతో, భక్తిశ్రద్ధలతో మరియు ఐక్యమత్యంతో జరుపుకోవాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు యూత్ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించిన దుర్గామాత ఆగమన్ ఉత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రతాప రామకృష్ణతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నానని, మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, యూత్ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పూల పండుగలో చిన్నారుల సందడి..

## కృష్ణవేణిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**రామగిరి, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి) :** పూలను పేర్చి బతుకమ్మగా కొలిచారు.. జానపద గీతాలకు అనుగుణంగా కోలటమాడారు.. సంప్రదాయ వస్త్రధారణతో తెలంగాణ సంస్కృతిని కళ్లకు కట్టారు. రామగిరి మండలం కల్వచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలు విద్యార్థుల సందడితో కళకళలాడాయి. 'మన కృష్ణవేణి బతుకమ్మ ఉత్సవాలు' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్ల శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందని, ప్రకృతిలో లభించే పూలతో అమ్మవారిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకతని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో 50కి పైగా బతుకమ్మలను రూపొందించి తమ సృజనాత్మకతను చాటారు. సంప్రదాయ పాటలు, కోలాటాలతో ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ప్రాంగణాన్ని పండుగ శోభతో నింపారు. చిన్నారుల ఆటపాటలు, రంగురంగుల బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల డైరెక్టర్ రంజిత్ రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# ఎఫ్ఎంజీ వైద్యులకు సమాన స్టైపెండ్ అందించాలి

## డాక్టర్ చాట్ల శ్రీధర్

**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 09, (ప్రజాజ్యోతి):** తెలంగాణలో కంపల్సరీ రొటేటింగ్ మెడికల్ ఇంటర్న్‌షిప్ (సీఆర్ఎంఐ) చేస్తున్న ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ (ఎఫ్ఎంజీ) వైద్యులకు సమాన స్టైపెండ్ అందించాలని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) కరీంనగర్ శాఖ అధ్యక్షుడు డా. శ్రీధర్ చాట్ల, ప్రధాన కార్యదర్శి డా. జి.ఎస్. శరణ్ కోరారు. ఈ మేరకు ఎఫ్ఎంజీ వైద్యులకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. రోగుల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఎఫ్ఎంజీ ఇంటర్న్‌లకు, భారతీయ వైద్య గ్రాడ్యుయేట్ ఇంటర్న్‌లతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పుడు న్యాయమైన స్టైపెండ్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. రెండు వర్గాల మధ్య స్టైపెండ్‌లో ఉన్న వ్యత్యాసాలను సంబంధిత అధికారులు సమీక్షించి, ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాలకు అనుగుణంగా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య కళాశాలల యాజమాన్యాలు ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని కోరారు. ఎఫ్ఎంజీ ఇంటర్న్‌ల సమస్యలను పరిష్కరించేందుకు పారదర్శకమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. వారి ప్రతినిధులతో చర్చలు జరిపి, న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. వైద్యుల గౌరవం, సమానత్వం, రోగుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఈ సమస్యను సామ-రస్యపూర్వకంగా పరిష్కరించాలని హెచ్ఆర్‌డీఏ ప్రతినిధులు కోరారు.



# ఓట్ల అవకతవకలపై కాంగ్రెస్ నిరసన

## సీఈసీ రాజీనామాకు డిమాండ్



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ఎన్నికల ఓట్లకు సంబంధించి అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటుకు రక్షణ కల్పిస్తూ ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఓట్ల అవకతవకలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందు ఉంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూడిది రాజేందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మటి నరసయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంధనకల్ పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ముస్తాబాద్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ముస్తాబాద్ మండలం బంధనకల్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. గ్రామ సర్పంచ్ చిగురు నరేశ్, ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్, గ్రామ పాలకవర్గ సభ్యులు హాజరై విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన, గౌరవం పెంపొందించేలా ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం సాగింది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు



**వేములవాడ, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల సాంస్కృతిక విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ.. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని ఆయన కొనియాడారు. విద్యార్థినులు, అధ్యాపకులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడిపాడి అలరించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవీందర్, అధ్యాపకులు అశోక్, మహేందర్, అంజయ్య, సంతోష్, భరత్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## పాఠశాలకు సౌండ్ బాక్స్ విరాళం అందించిన వార్డు సభ్యురాలు

**ముస్తాబాద్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఒకటవ వార్డు సభ్యురాలు గడ్డం సౌమ్య సురేష్ సౌండ్ బాక్స్‌ను విరాళంగా అందించారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను సర్పంచ్ చిగురు నరేష్, హెచ్ఎం రాజ్‌కుమార్ అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి, గ్రామ ప్రగతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు పాఠశాలల వసతుల కల్పనకు దోహదపడతాయని పేర్కొన్న ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్ పదవి సీనియర్లకే ఇవ్వాలి

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**
ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవికి తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ కోసం ఏళ్లుగా శ్రమిస్తున్న సీనియర్ కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు వంగా గిరిధర్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మండల ఉపాధ్యక్షుడు పద్మారెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లను వ్యక్తిగతంగా కలిసి వినతిపత్రం అందజేశారు. గడిచిన 20 ఏళ్లుగా పార్టీకి నమ్మకమైన కార్యకర్తగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా నిరంతరం పార్టీ సేవలలో ముందున్నానని తెలిపారు. పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్ పదవిని తనకు కేటాయించాలని మంత్రి, టీపీసీసీ అధ్యక్షులకు గిరిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు..

### 1.1 కిలోల గంజాయి స్వాధీనం

**కరీంనగర్ క్రైం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**
గంజాయి విక్రయిస్తున్న ఒక యువకుడిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 1.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగునూర్ - జూబ్లీనగర్ రహదారిలోని మాలగుట్టల సమీపంలో శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా పైల్లా శ్రీమాన్ (18) పట్టుబడగా, మరొకరు బైక్‌పై పరారైనట్లు రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. నిందితులు మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి గంజాయిని తెచ్చి కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో రూ.100 చొప్పున ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. పట్టుబడిన యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నామని సీఐ వివరించారు.

# యశోద ఆసుపత్రిలో అత్యాధునిక చెవి, ముక్కు, గొంతు వైద్య సేవలు

- స్వరపేటిక, శ్వాసనాళ సమస్యలకు ప్రత్యేక చికిత్సలు..
- డా. అశీష్ డోరా యశోద హాస్పిటల్ సోమాజిగూడ



**కరీంనగర్ టౌన్,అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి)**
చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు సోమాజిగూడలోని యశోద ఆసుపత్రి ప్రత్యేక వైద్య విభాగాన్ని మరింత బలోపేతం చేసింది. స్వరపేటిక, శ్వాసనాళాలు, పిల్లల్లో చెవి, ముక్కు, గొంతు సమస్యలు, తల మరియు మెడ శస్త్రచికిత్సలు, ముక్కు సంబంధిత వ్యాధులు, కపాలపు అడుగు భాగానికి సంబంధించిన శస్త్రచికిత్సలు, చెవి వ్యాధులు, అలర్జీల చికిత్సలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన వైద్య బృందం సేవలు అందిస్తోంది. గొంతు నుంచి శబ్దం రావడంలో ఇబ్బందులు, స్వరంలో మార్పులు, మింగడంలో సమస్యలు, పిల్లల్లో శ్వాసనాళ సంబంధిత వ్యాధులు, శ్వాసనాళాలు సన్నబడటం, గురక, నిద్రలో శ్వాసకు ఆటంకాలు వంటి సమస్యలకు ఈ విభాగంలో ప్రత్యేక పరీక్షలు, ఔషధ చికిత్సలు, అవసరమైన శస్త్రచికిత్సలు అందిస్తున్నారు. ముఖ్యంగా సంక్లిష్టమైన స్వరపేటిక, శ్వాసనాళ సమస్యలకు ఆధునిక వైద్య విధానాల ద్వారా చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రోగులకు వ్యాధులను కచ్చితంగా గుర్తించి, తగిన చికిత్స అందించేందుకు అత్యాధునిక వైద్య సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఉన్నత స్పష్టతతో కూడిన అంతర్దర్శిని పరీక్షలు, నారో బ్యాండ్ ఇమేజింగ్ (ఎన్‌బీఐ), స్వరపేటిక కంపనాలను పరిశీలించే స్ట్రోబోస్కోపీ వంటి అధునాతన నిర్ధారణ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు ఆధునిక శస్త్రచికిత్సా విధానాలను అనుసరిస్తూ, వివిధ ప్రత్యేక విభాగాల వైద్యులు సమన్వయంతో రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఈ వైద్య బృందంలో స్వరపేటిక వైద్యం, పిల్లల చెవి, ముక్కు, గొంతు వైద్యం, శ్వాసనాళ శస్త్రచికిత్సలు, అలర్జీలు, చెవి వ్యాధుల చికిత్సలో ప్రత్యేక అనుభవం కలిగిన డా.అశీష్ డోరా ఘనుప్పార్ సేవలందిస్తున్నారు. అలాగే తల, మెడ క్యాన్సర్ శస్త్రచికిత్సలు, ముక్కు సంబంధిత వ్యాధులు, కపాలపు అడుగు భాగానికి సంబంధించిన శస్త్రచికిత్సల్లో నైపుణ్యం కలిగిన డా. ఎన్. అపూర్వా రెడ్డి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డా. అశీష్ డోరా ఘనుప్పార్ మాట్లాడుతూ, “సాధారణ చెవి, ముక్కు, గొంతు సమస్యల నుంచి సంక్లిష్టమైన స్వరపేటిక, శ్వాసనాళ సమస్యల వరకు అన్ని రకాల వ్యాధులకు సమగ్ర వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం. వివిధ ప్రత్యేక విభాగాలకు చెందిన వైద్యులు సమన్వయంతో పనిచేయడం ద్వారా రోగులకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు, శస్త్రచికిత్సలను ఒకే చోట అందించగలుగుతాం. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ, శాస్త్రీయ ఆధారాలతో కూడిన వైద్య విధానాల ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు సుధీర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదు

- బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదు
- ప్రజల బాగోగులు మరిచి ఉనికి కోసం డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ మండిపాటు



**కొత్తపల్లి, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):**
అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్, ఎనిమిది నెలలుగా అభివృద్ధిని విస్మరించిన బీజేపీలకు రానున్న రోజుల్లో ప్రజల చేతుల్లో పరాభవం తప్పదని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ హెచ్చరించారు. శుక్రవారం తీగలగుట్టపల్లి 3వ డివిజన్ కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు నీటి ఎద్దడి, కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతుంటే, ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సూచనలు ఇవ్వాల్సింది పోయి రాజకీయ లబ్ధి కోసమే తాపత్రయపడుతున్నాయని విమర్శించారు. డంప్ యార్డు, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ జాప్యం వల్ల ప్రజలు నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో అశాంతి రేపుతున్న ఈ రెండు పార్టీల తీరును ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మూల క్రిష్ణారెడ్డి, కూన దామోదర్, మెతుకు కాంతయ్య పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థులు

**సుల్తానాబాద్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**
సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్) విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల యాజమాన్యం శుక్రవారం తెలిపింది. 10 ఏళ్ల బాలుర విభాగంలో జె. శ్రేయన్ గౌడ్ (60 మీటర్ల పరుగు పందెం), బి. మహంత్ కృష్ణ (లాంగ్ జంప్) జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ నెల 11న ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులతో పాటు శిక్షణ ఇచ్చిన కోచ్ సత్యనారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సునీత, మేనేజర్ శివ, వ్యాయామ ఉపాధ్యాయులు సతీష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా నిలవాలి: ఆది శ్రీనివాస్

- వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ అభినందన సభ
- సన్న రకం వరి సాగుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వ విప్ వెల్లడి



**వేములవాడ, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) నూతన పాలకవర్గ అభినందన సభ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు రైతులకు నిరంతరం సేవలు అందిస్తూ ప్రభుత్వానికి – రైతులకు మధ్య వారధిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవుల ఎంపికలో కష్టపడే తత్వానికి ప్రాధాన్యత ఇచ్చామని, ఇతర సీనియర్ నాయకులకు భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, సన్న రకం వరి సాగు చేసే రైతులకు మద్దతు ధరతో పాటు 500 బోనస్ అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పుల్కం రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, పలువురు సొసైటీ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.



## బండలింగంపల్లి నుంచి హైదరాబాద్‌కు బస్సు నడపాలని వినతి

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట మీదుగా హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభించాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం బండలింగంపల్లికి చెందిన మర్పు సంజీవరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సాదిక్ మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో హైదరాబాద్ నుంచి వచ్చే, వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సు సర్వీస్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని వారు వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని లేదా నూతన సర్వీసును కేటాయించాలని మంత్రిని కోరారు.

# మాన్యశ్రీ కాన్షీరామ్ వర్ధంతి వేడుకలు

- సుద్దాలలో కాన్షీరామ్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు
- బహుజన ఐక్యత కోసం కృషి చేయాలని నాయకుల పిలుపు



**కోనరావుపేట, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** బహుజనుల రాజకీయ సాధికారత కోసం జీవితాంతం కృషి చేసిన బిఎస్పీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరామ్ 20వ వర్ధంతి వేడుకలను కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కాన్షీరామ్ విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు దొబ్బల స్వామి ఆధ్వర్యంలో నాయకులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల ఆత్మగౌరవం, రాజ్యాధికారం కోసం కాన్షీరామ్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్, పూర్వ ప్రజాప్రతినిధులు, వివిధ కులసంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాచర్ల గొల్లపల్లె పాఠశాలలో టై బెల్టుల పంపిణీ

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లె గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించి, విద్యార్థులకు టై బెల్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ సర్పంచ్ నేవూరి జయ-భాగ్యరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో పాఠశాలకు హాజరై ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, గ్రామ నాయకుల సహకారంతో పాఠశాలలో పండుగ వాతావరణంలో ఈ వేడుకలు సాగాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయ-భాగ్యరాజ్, మాజీ సర్పంచ్ పడిగల రవీందర్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు ప్రశాంత్, మహిపాల్, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రపంచ తపాలా శాఖల్లో భారత తపాలా రారాజు: హెచ్ఎం లక్ష్మీనారాయణ

- ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా వేములవాడ పోస్టాఫీస్‌ను సందర్శించిన విద్యార్థులు
- తపాలా సేవల ప్రాముఖ్యత, పిన్ కోడ్ విధానంపై పాఠశాల విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన





**వేములవాడ, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** ప్రపంచంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థ ఉన్న దేశంగా భారత్ రికార్డు సాధించిందని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. అంతర్జాతీయ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేములవాడ భగవంతరావు నగర్‌లోని పోస్టాఫీస్‌కు విద్యార్థులను తీసుకెళ్లి, తపాలా సిబ్బంది విధులు మరియు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. 1854 అక్టోబర్ 1న ప్రారంభమైన భారత తపాలా శాఖ నేడు సాంకేతికతకు అనుగుణంగా ఈ-పోస్ట్ సేవల వరకు విస్తరించిందన్నారు. ఉత్తరాల రవాణాలో వేగం, కచ్చితత్వం కోసం 1972లో ప్రవేశపెట్టిన 6 అంకెల పిన్ కోడ్ వ్యవస్థ పనితీరును, పోస్టల్ చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పోస్ట్ మాస్టర్, ఉపాధ్యాయులు దుర్గేటి లక్ష్మీనారాయణ, మోహన్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బ్లూబెల్స్ హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ హైస్కూల్‌లో శుక్రవారం బతుకమ్మ వేడుకలను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ప్రిన్సిపాల్ జంగ సునీత మనోహర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తులు ధరించి, పూలతో పేర్చిన బతుకమ్మలతో సందడి చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల విశిష్టతను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలతో సంబరాలను వైభవంగా ముగించారు.



## రాగంపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**చొప్పదండి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలం రాగంపేట గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గత పదేళ్ల పాలనలో పేదలకు కొత్త రేషన్ కార్డులు అందలేదని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డులు అందించడంతో పాటు సన్న బియ్యం సరఫరా చేస్తోందని నేతలు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి, పట్టుదలతో చొప్పదండి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేసిన ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, సర్పంచ్ మామిడి రాజేశం, సింగిల్ విండో చైర్మన్లు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సోషల్ యాక్టివిస్ట్ నరేష్‌కు సీపీ సజ్జనార్ అభినందనలు



**చొప్పదండి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ జిల్లాకు చెందిన సోషల్ యాక్టివిస్ట్, రక్తదాన ప్రోత్సాహకుడు నరేష్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ శుభాకాంక్షలు తెలిపారు. గత పదేళ్లుగా నరేష్ చేపడుతున్న నిరంతర రక్తదాన శిబిరాలు, వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. నరేష్ సేవలను ఆదర్శంగా తీసుకుని యువత సైతం సమాజ సేవలో నిరంతరం ముందుండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సీపీ ఆశీస్సులు పొందడం ఎంతో సంతోషంగా ఉందని, ఆయన చూపిన అంకితభావం తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని నరేష్ పేర్కొన్నారు.

# దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సింగరేణి, మున్సిపల్, పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**గోదావరిఖని, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ సింగరేణి స్టేడియంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. స్టేడియం పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సింగరేణి, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొని సంతోషంగా పండుగను జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జల్ల అరుణశ్రీ, రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి, సింగరేణి, మున్సిపల్ శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కాన్షిరాం ఆశయ సాధనకు బహుజనులు కృషి చేయాలి

**ధర్మారం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** బహుజన ఉద్యమ దార్శనికుడు మాన్యశ్రీ కాన్షిరాం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దళిత, బహుజన నాయకులు పిలుపునిచ్చారు. ధర్మారం మండలం పత్తిపాక ఎక్స్‌రోడ్డులోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం సుంచు మల్లేశం ఆధ్వర్యంలో కాన్షిరాం 20వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అధికారం, ఆత్మగౌరవం, సమానత్వం కల్పించేందుకు కాన్షిరాం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఆయన చూపిన బాటలో పయనిస్తూ బహుజనుల ఐక్యతను చాటాలని కోరిన ఈ కార్యక్రమంలో దళిత, బహుజన నాయకులు



మెట్పల్లి నరేష్, వాడకాపురం రవి, దీకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు కృషి చేస్తాం

## విప్ విజయరమణారావు

- సమాజ హితం కోసం శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచన

**పెద్దపల్లి, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):**



నిరంతరం శ్రమిస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం తరఫున చిత్తశుద్ధితో కృషి చేస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లిలో పెద్దపల్లి నియోజకవర్గ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు సమర్పించిన వినతిపత్రంపై సానుకూలంగా స్పందించారు. పారదర్శక ప్రక్రియ కోసం యూనియన్లకు అతీతంగా ఐదుగురితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, సమస్య పరిష్కారానికి అధికారులతో మాట్లాడి పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. పెద్దపల్లి పరిసరాల్లో ప్రభుత్వ స్థలాలు కొరతగా ఉన్నందున అనువైన సర్వే నంబర్లను గుర్తించి తన దృష్టికి తేస్తే త్వరలోనే ఇళ్ల స్థలాల కేటాయింపునకు మార్గం సుగమం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేడారం రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం గుట్టు రట్టు

- 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు
- మిల్లు యజమాని సహా ముగ్గురిపై కేసు నమోదు



**ధర్మారం, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి):** ధర్మారం మండలం మేడారంలోని శ్రీలక్ష్మి నరసింహ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారనే పక్కా సమాచారంతో పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. శుక్రవారం చేపట్టిన ఈ తనిఖీల్లో 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, ఫుడ్ ఇన్స్పెక్టర్ వెంకట రాజిరెడ్డి, టీఏ రమేష్ తనిఖీల్లో పాల్గొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా బియ్యం తరలించిన వ్యక్తి, అతనికి సహకరించిన వ్యక్తితో పాటు రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పారమిత హెరిటేజ్ . పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



**కరీంనగర్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి)** స్థానిక పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు సంప్రదాయక దుస్తులు ధరించి, సృజనాత్మక నైపుణ్యంతో వివిధ రకాల పూలతో పోటా పోటీగా బతుకమ్మలను పేర్చి అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు బతుకమ్మలను పేర్చే విధానం, బతుకమ్మ పాటలు, సాంప్రదాయక వంటకాల పోటీలను నిర్వహించి, ఉత్తమ ఎంపికలకు బహుమతులను అందజేశారు. అనంతరం వివిధ తరగతుల విద్యార్థినులు వారి తల్లులు మరియు ఉపాధ్యాయినులు, కోలాటాలతో, నృత్యాలతో పాటలతో పలువురిని అలరించారు. ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద రావు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల తల్లిదండ్రులకు ముందస్తు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు అనూకర్ రావు, ప్రసూన, రశ్మిత, వినోద్‌రావు, వి. యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూ రిజర్వేతో భూ సమస్యలు పరిష్కారం.

**తహసిల్దార్ డాక్టర్ రాపల్లి రాముడు.**

**కల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి)** ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ సర్వే తో. రైతుల యొక్క భూముల సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తహసిల్దార్ ట్రాక్టర్ రాపల్లి రాముడు రైతులకు సూచించారు. కల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్ఖాన్పేట్ గ్రామంలో శుక్రవారం రోజున. గ్రామ సభ నిర్వహించి .రైతులకు పలు సూచనలు ఇచ్చారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జోష్న . ఆర్ఐ రాజు.తదితరులు పాల్గొన్నారు.





## కులాభరణం శ్రీనివాస్‌కు ఘనసన్మానం

**వేములవాడ, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ బాధ్యతలు స్వీకరించిన వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు వకులాభరణం శ్రీనివాస్‌ను శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో సన్మానించారు. జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు సోమినేని బాలు, కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామ పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూకలమర్రి గ్రామానికి చెందిన నాయకుడికి సముచిత గుర్తింపునిస్తూ ఈ అవకాశం కల్పించినందుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు.



## గోదావరిఖనిలో ఈ నెల 25న అలాయ్ బలాయ్

**గోదావరిఖని, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 25న గోదావరిఖని సిరి ఫంక్షన్ హాల్‌లో అలాయ్ బలాయ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సామాజిక ఐక్యవేదిక కన్వీనర్ క్యాతం వెంకటరమణ తెలిపారు. శుక్రవారం మేదరి సంఘం భవనంలో నిర్వహించిన వివిధ కుల సంఘాల సమావేశంలో ఆహ్వాన సమితి అధ్యక్షుడిగా ముడతనపల్లి సారయ్య, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి భాస్కర్, చీఫ్ అడ్వైజర్‌గా బందారి రాజమల్లులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ.. పారిశ్రామిక ప్రాంతంలో గత 13 ఏళ్లుగా రాజకీయాలకతీతంగా సమరసత, సోదరభావాన్ని చాటేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు విశేష సంఖ్యలో హాజరై అలాయ్ బలాయ్‌ను విజయవంతం చేయాలని కోరిన ఈ సమావేశంలో పలువురు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వివేకానంద విద్యానికేతన్‌లో వైభవంగా బతుకమ్మ సంబరాలు



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ భగత్ నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో పాఠశాల ప్రాంగణాన్ని సందడిగా మార్చారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య సొగాని మాట్లాడుతూ.. పిల్లలకు చిన్నతనం నుంచే మన ఆచారాలు, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతిఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించిన ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సొగాని రాజేశ్వరి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ద

## విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘం కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నేలపల్లి గణేష్ చారి, ఉపాధ్యక్షుడిగా కాంబోజ శ్రీనివాస్ చారి, క్యాషియర్‌గా కాంభోజ ప్రశాంత్, కార్యదర్శిగా రుద్రాక్ష్ రవి చారి ఎంపికయ్యారు. అలాగే సంఘం సలహాదారులుగా కాంభోజ దేవరాజు, నేలపల్లి రవీంద్ర చార్యులను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సంఘం అభివృద్ధికి, సమాజ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## వాణినికేతన్ హైస్కూల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

**ఇల్లంతకుంట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఇంటి వద్ద తీరొక్క పూలతో తయారుచేసిన బతుకమ్మలతో పాఠశాలకు హాజరై, సాంప్రదాయ దుస్తులు ధరించి కోలాటాలు, దాండియా నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ అందరి జీవితాల్లో ఆనందం నింపాలని ఆకాంక్షించారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువులో నిమజ్జనం చేసిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఎంపీ నిధులతో మంజూరైన బోరు మోటారు ప్రారంభం

**కోనరావుపేట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలోని అంబేద్కర్ సంఘ భవనంలో ఎంపీ నిధులతో మంజూరైన బోరు మోటారును శుక్రవారం సర్పంచ్ మిర్యాల్‌కార్ బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సంఘ భవనంలో తాగునీటి ఎద్దడిని గుర్తించి ప్రత్యేకంగా ఎంపీ నిధుల నుంచి బోరు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామంలోని అన్ని కుల సంఘాల భవనాలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపిన ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడే సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



**సుల్తానాబాద్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు సుల్తానాబాద్ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం 'సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ (ఎస్పీఎల్) సీజన్--2' ప్రారంభం కానుంది. ఈ పోటీలను స్థానిక ఆరో వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ సొంత ఖర్చులతో స్పాన్సర్ చేస్తుండగా, విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీ-య బహుమతిగా రూ.50 వేలు అందజేయనున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరై ఈ లీగ్‌ను ప్రారంభించనున్నారు. టోర్నీ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని ఎస్పీఎల్ నిర్వాహకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి.రమేష్‌ను ఆహ్వానించారు.

# కాకతీయ స్మార్ట్ కిడ్స్ స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ, రామలీల ఉత్సవాలు





**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ కట్టరాంపూర్‌లోని కాకతీయ స్మార్ట్ కిడ్స్ స్కూల్‌లో శుక్రవారం బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ-ప్రైమరీ చిన్నారులు నవదుర్గల వేషధారణలతో పాటు రామాయణ నాటకం, రామలీలా ఘట్టాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆటపాటలు పాడుతూ సంబరాలను వైభవంగా జరుపుకున్నారు. చదువుతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మరియు పండుగల విశిష్టతను చిన్నారులకు తెలియజేయడానికే ఈ వేడుకలు నిర్వహించినట్లు కరస్పాండెంట్ గున్నాల క్రాంతి కుమార్, ప్రిన్సిపాల్ గున్నాల అర్చన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని అలరించిన చిన్నారుల ప్రదర్శనలను అభినందించారు.

# వసంత్ వ్యాలీ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** హనుమాన్ నగర్‌లోని వసంత్ వ్యాలీ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల చైర్మన్ ఏ. బుచ్చిరెడ్డి, కరస్పాండెంట్ స్వరూప పాల్గొని విద్యార్థులతో కలిసి తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం ఎంతో అవసరమన్నారు. పండుగలు అందరిలో సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్న ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అసంపూర్తిగా నిలిచిన శివంగాలపల్లి - ఎల్లారెడ్డిపేట రోడ్డు






**కోనరావుపేట, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామం నుంచి ఎల్లారెడ్డిపేట వెళ్లే ప్రధాన రహదారిపై 600 మీటర్ల మేర పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలి వర్షాలకు రోడ్డు బురదమయంగా మారడంతో గ్రామ-స్తుల కష్టాలను గుర్తించిన సర్పంచ్ అంబటి చైతన్య శేఖర్ శుక్రవారం పాలకవర్గంతో కలిసి తాత్కాలికంగా మట్టి పోయించి రాకపోకలకు వీలు కల్పించారు. ఇది కేవలం తాత్కాలిక పరిష్కారమేనని, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని సర్పంచ్ శేఖర్, గ్రామ ప్రజలు కోరారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే శివంగాలపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మరింత సులభతరమవుతుందని పేర్కొన్నారు.

# శివారు డివిజన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

## మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్,అక్టోబర్ 9( ప్రజాజ్యోతి )** నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాలు, శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 28వ డివిజన్‌లోని విద్యారణ్యపురి కాలనీలో రూ.50 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్లు నున్నావత్ భాస్కర్, సాధినేని లావణ్య మునీందర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రాధాన్యత క్రమంలో కల్పిస్తున్నామని తెలిపారు. విద్యారణ్యపురి అభివృద్ధికి గతంలో రూ.కోటి సాధారణ నిధులు కేటాయించడంతో పాటు, ఇటీవల రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రూ.80 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి టెండర్ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లకు రూ.2.80 కోట్లు కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ శ్రీనివాస్, ఏఈ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ, దాండియా ఉత్సవాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్ టౌన్,అక్టోబర్ 9( ప్రజాజ్యోతి )**

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవం, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ముందస్తుగా నిర్వహించిన బతుకమ్మ మహోత్సవం, దాండియా ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధించడం, పూల ప్రాముఖ్యతను గుర్తించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం బతుకమ్మ పండుగ ప్రధాన సందేశమని తెలిపారు. దాండియా నృత్యం భారతదేశంలోని ప్రసిద్ధ జానపద నృత్యాల్లో ఒకటని, గుజరాత్‌లో ఉద్భవించిన ఈ నృత్యం నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తాయని వివరించారు.వేడుకల్లో భాగంగా విద్యార్థినులు అందంగా రూపొందించిన బతుకమ్మలను ప్రదర్శించగా, బతుకమ్మ పాటలు, దాండియా నృత్యాలతో సందడి చేశారు. విద్యార్థుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు ఉత్సవాలకు మరింత కళను తీసుకొచ్చాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఏటా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తున్నామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ వర్క్‌షాప్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐక్యకూటమి ఘన విజయం

### 12 ఏళ్ల తర్వాత భారీ మెజార్టీ..

**కరీంనగర్, అక్టోబర్ 9 (ప్రజాజ్యోతి )**

కరీంనగర్ ఆర్టీసీ వర్క్‌షాప్ జోనల్ పరిధిలో సుమారు 12 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐక్యకూటమి భారీ మెజార్టీతో విజయం సాధించింది. కాంగ్రెస్, టీఆర్ఎస్ ఐక్యకూటముల మధ్య జరిగిన పోటీలో వర్క్‌షాప్ ఉద్యోగులు కాంగ్రెస్ కూటమికి మద్దతుగా నిలిచారని యూనియన్ నాయకులు తెలిపారు. ఆర్టీసీ వర్క్‌షాప్ జోనల్ గౌరవ అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో యూనియన్ నాయకులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేసి ఈ విజయాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. నాయకులు ఆంజనేయులు, రాజా, ప్రవీణ్ కుమార్, సాయికుమార్, లవ్ కుమార్, వెంకటస్వామి తదితరులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. దీర్ఘకాలం తర్వాత లభించిన విజయం యూనియన్‌కు కొత్త



ఉత్సాహాన్నిచ్చిందని, ఉద్యోగులకు తమపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## కృష్ణవేణి హై స్కూల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**గోదావరిఖని, అక్టోబర్ 09 (ప్రజా జ్యోతి)**

గోదావరిఖని కృష్ణవేణి హైస్కూల్లో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ప్రిన్సిపల్ ఏ. శైలజ ఆధ్వర్యంలో బతుకమ్మ ఆటపాటలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగావిద్యార్థినిలు సంప్రదాయ దుస్తుల్లో రంగు రంగుల పూలతో అందాల బతుకమ్మలను పేర్చారు.అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. విద్యార్థులు ఉత్సాహంగా బతుకమ్మ పండుగ ఉత్సవాలను సంబరాలతో జరుపుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రాజి రెడ్డి రెడ్డి మాట్లాడుతూ నేటి తరానికి మన సంప్రదాయాలను,తెలంగాణ సంస్కృతిని విద్యార్థులకు, అలవర్చడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఇంచార్జ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓడేడు గ్రామంలో ముందస్తు పరిశుభ్రత పనులు



**ముత్తారం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి, ఉపసర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు పారిశుధ్య పనులు చేపట్టారు. సద్దుల బతుకమ్మ వేడుకల వేళ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జేసీబీ సహాయంతో బస్టాండ్ పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి స్థలాన్ని శుభ్రం చేసి చదును చేశారు. గ్రామస్తులు సంతోషంగా పండుగలు జరుపుకునేలా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే తమ లక్ష్యమని, పండుగల సమయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సర్పంచ్ కవిత తెలిపారు. గ్రామ అభివృద్ధికి తోడు పారిశుధ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆమె పేర్కొన్నారు.



## చిన్నారులతో ముందస్తు బతుకమ్మ సంబరాలు

**ధర్మారం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నాయకంపల్లి తండా అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ ఏదుల దేవేంద్ర ఆధ్వర్యంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా టీచర్ దేవేంద్ర మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పిల్లలకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు మరియు ప్రకృతి ఆరాధన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకే ఈ వేడుకలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దశరథం రెడ్డి, వార్డు సభ్యురాలు పల్లపు వర్షిణి, అంగన్వాడీ చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామసభలో పోలీసుల అవగాహన కార్యక్రమం



**ముస్తాబాద్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో సిరిసిల్ల రూరల్ సీఐ నాగేశ్వరరావు, ఎస్సై జ్యోతి పాల్గొని ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చట్టాలపై అవగాహనతో నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైతి యాదమ్మ, వార్డు సభ్యులు బైతి నవీన్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే తల్లి, బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం



**ధర్మారం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**

ధర్మారం మండలం మేడారం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెక్టార్ సూపర్‌వైజర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు రోజువారీ ఆహారంలో పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు తప్పనిసరిగా తీసుకోవడం ద్వారా తల్లి, పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించి, అందరిచేత పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ముందస్తు బొడ్డెమ్మ వేడుకలు, బతుకమ్మ ఆటపాటలతో సందడి చేసిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వనజ, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## టీబీ వ్యాధి రహిత గ్రామంగా కమ్మరిఖాన్‌పేట ఎంపిక



**ధర్మారం, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట గ్రామం టీబీ (క్షయ) వ్యాధి రహిత గ్రామంగా ఎంపిక కావడం పట్ల సర్పంచ్ ఇరుగురాల మహేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య సిబ్బందిని శుక్రవారం పంచాయతీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు నిరంతరం శ్రమించి ప్రజల్లో అవగాహన కల్పించడం వల్లే గ్రామానికి ఈ అరుదైన గుర్తింపు లభించిందని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ గ్రామాన్ని ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి అంజలి, ఏఎన్‌ఎం కరుణ, ఆశా కార్యకర్తలు మరియు ఉపసర్పంచ్ ప్రమోద్ పాల్గొన్నారు.

## వెంకట్రావుపేట కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



**కోనరావుపేట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పల్లె రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు మానుక సత్యం, సింగిల్ విండో డైరెక్టర్ నాలుక సత్యం హాజరై, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన చెరుకుపల్లి మాధవరెడ్డి, నాలుక రాజయ్యతో పాటు నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మానుక సత్యం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరిన ఈ కార్యక్రమంలో మండల నాయకులు జక్రీగా వెంకటేశం, ఎక్కలదేవి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు నాలుక వేణు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**ఇల్లంతకుంట, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీ గంగాధర క్షేత్రంలో నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. సర్పంచ్ మామిడి రాజు, ఆలయ వ్యవస్థాపకుడు, ఉపసర్పంచ్ మూగు నాగరాజు శర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు శర్మ మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శ్రీ దుర్గామాతా శరన్నవరాత్రోత్సవాలను క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఒగ్గు నర్సయ్య యాదవ్, వార్డు సభ్యులు రేగుల కార్తీక్, రాకం సుమన్, చేరాల వంశీ, అంతటి శ్రీకాంత్ మరియు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మంథని ఆర్టీసీ డిపో ఎన్నికల్లో కేకే రెడ్డి విజయం



ఆర్టీసీ డిపో కార్యదర్శిగా గెలుపొందిన కేకే రెడ్డి



**మంథని, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** మంథని ఆర్టీసీ డిపోలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో టీఎంయూ, ఈయూ కూటమి అభ్యర్థి కేకే రెడ్డి విజయం సాధించారు. డిపోలోని మొత్తం 178 ఓట్లకు గాను తెలంగాణ మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ యూనియన్ కూటమికి 91 ఓట్లు రాగా, ప్రతిపక్ష టీడబ్ల్యూయూ కూటమికి 85 ఓట్లు పోలయ్యాయి. దీంతో కేకే రెడ్డి ప్రత్యర్థిపై 6 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఈ విజయంతో హర్షం వ్యక్తం చేస్తూ ఐక్య కూటమి నాయకులు, కార్మికులు బస్సు డిపో నుంచి ప్రధాన అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు.

# పెద్దపల్లిలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ దశాబ్ది ఉత్సవాలు



**పెద్దపల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం పెద్దపల్లి నియోజకవర్గంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10.30 గంటలకు పెద్దపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరులకు నివాళు లర్పించడంతో పాటు కేసీఆర్ నాయకత్వంలో జరిగిన పెద్దపల్లి జిల్లా ఆవిర్భావం, పరిపాలనా వికేంద్రీకరణ, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను స్మరించుకోనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పిలుపునిచ్చింది.

# రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**కరీంనగర్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా, రైతు బీమా, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నదాతలను మోసం చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. కరీంనగర్‌లో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మోతే గంగారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేయడంతో పాటు, 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన వ్యవసాయ భూములను తక్షణమే తొలగించాలని కోరారు. రుణమాఫీ, యూరియా కొరత, విద్యుత్ కోతల సమస్యలపై ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చిన ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, నూతుల శ్రీనివాస్ రెడ్డి మరియు నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఇళ్లు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మంజూరైన ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ పంపిణీని త్వరితగతిన పూర్తి చేసి, ఇప్పటివరకు పనులు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ మార్కింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేసిన ఈ సమీక్షలో హౌసింగ్ పీడీ పవన్ కుమార్, డిప్యూటీ ఈఈ దస్తగిరి, ఏఈలు పాల్గొన్నారు.

# కళ్లు తెరిచి కరెంటు, నీళ్లు ఇవ్వకపోతే సబ్‌స్టేషన్‌ల ముట్టడి!

## పంటలను కాపాడకపోతే రైతుల ప్రాణాలు పోయేలా ఉన్నాయి







- రైతులను కాపాడే వరకు విశ్రమించకుండా పోరాటం చేస్తాం
- కాలయాపనకే మంత్రితో ఫోటోలు దిగుతున్న దుద్దిళ్ల
- కాంగ్రెస్‌కు దోపిడి మీద ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదు
- మంథనిలో రైతులతో బిఆర్ఎస్ శ్రేణుల ధర్నా
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మంథని, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** జిఓ ఇచ్చి పంటలకు నీళ్లు ఇప్పించాల్సిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరో మంత్రి దగ్గరకు పోయి ఫోటోలు దిగుతున్నాడంటే, నీళ్లు మరియు కరెంటు ఇచ్చేందుకు కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేసేందుకేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. అప్రకటిత విద్యుత్ కోతలు, ఎస్సారెస్పీ నీళ్లు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతుండడంతో రైతులతో కలిసి శుక్రవారం మంథని పాత పెట్రోల్ బంక్ సమీపంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో ధర్నా నిర్వహించారు. సుమారు గంట పాటు చేపట్టిన ఈ నిరసనతో వాహనాలు నిలిచిపోయాయి.

### కళ్ల ముందే ఎండిపోతున్న పంటలు

పుట్ట మధుకర్ మాట్లాడుతూ.. రైతులు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరిపంట ప్రస్తుతం పొట్టదశకు వచ్చిందని, కరెంటు లేక బోర్లు పని చేయక పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి గెలిచిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, ఇప్పుడు రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేసులు పెట్టినా, ఎంత నిర్బంధం విధించినా రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

### ఎల్‌నినో తెలిసినా ముందస్తు ప్రణాళిక ఏది?

ఎల్‌నినో ప్రభావం ఉంటుందని రెండేళ్ల ముందే వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు డిమాండ్‌కు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలు చేపట్టలేదని పుట్ట మధుకర్ మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు ఉన్న శ్రద్ధ దోపిడీ మీద తప్ప ప్రజల సమస్యలపై లేదని ఆరోపించారు.

### వెంటనే స్పందించకపోతే తీవ్ర ఆందోళనలు

ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కళ్లు తెరిచి వ్యవసాయానికి సరిపడా ఉచిత కరెంటు, ఎస్సారెస్పీ నీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలు తీర్చకపోతే రాబోయే రోజుల్లో సబ్‌స్టేషన్‌లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## కాకతీయ పాఠశాలలో ముందస్తుగా బతకమ్మ వేడుకలు



**మంథని, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** మంథని పట్టణంలోని కాకతీయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా బతకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.
తెలంగాణ ప్రభుత్వము రేపటి నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో పండగను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పువ్వులతో అందంగా బతుకమ్మ నీ పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ దాండియా నృత్యాల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ మన దేశంలో పండగలు మన ఔన్నత్యాన్ని తెలియజేస్తాయని, తెలంగాణలో బతుకమ్మ పండుగ అతిపెద్ద పండుగ అని, ఈ పండగ మన జీవన శైలికి నిదర్శనమన్నారు. బతుకమ్మ దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండగ పువ్వులతో పూజించే పెద్ద పండుగ అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పండగను తమ సొంత గ్రామాలలో జరుపుకునే పండుగ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆఫ్రికా అంతర్జాతీయ ఆర్ట్ పోటీల్లో మెరిసిన 83 మంది త్రీడి ఆర్టిస్ట్ శివరామకృష్ణ శిష్యులు

### శిష్యుల్లో కూతురు హిమానితో పాటు 35 మంది మంథని పిల్లలు

**మంథని, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** ఆఫ్రికాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడిన అంతర్జాతీయ ఆర్ట్ పోటీల్లో మంథని కి చెందిన ప్రముఖ అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ సింగారపు శివరామకృష్ణ శిష్యులు 83 ఆర్ట్ పోటీల్లో మెరిసారు. శివరామకృష్ణ స్థాపించిన ఎస్-ఎస్ఆర్కే అకాడమీ, గ్లోబల్ ప్లాట్ ఫాం ఫర్ ఆర్ట్స్ నుంచి తన కూతురు హిమానితో పాటు దాదాపు 83 మంది అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ ప్రశంసా పత్రాలను సాధించారు. 83 మందిలో మంథని నుంచి 35 మంది పిల్లలు ఉన్నారు. వీరికి కృష్ణ ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చి యుద్ధం వద్దు, శాంతి మాత్రమే కావాలనే ఉద్దేశంతో గీసిన ఆర్ట్స్ పరీక్షించి, ఆఫ్రికా ఆర్ట్ పోటీ నిర్వాహకులకు పంపించారు. ఈ పోటీ నిర్వాహకులు నాజీ బెనాజీ తో తనకు ఉన్న ప్రత్యేక అనుబంధం వల్లనే ఈ ఘనత సాధ్యమైందని కృష్ణ నాజీ బనాజీ కి కృతజ్ఞతలు తెలిపారు. తాను నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పోటీలకి కృష్ణ సహకారం చేయడం తనకు సంతోషంగా ఉందని నాజీ బనాజీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోటీలో మంథని పట్టణంలోని కాకతీయ స్కూల్ విద్యార్థులు కృష్ణవేణి స్కూల్ విద్యార్థులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి, అమెరికా, దుబాయ్, కువైట్, యూకే, స్వీడన్ లాంటి వివిధ దేశాల నుంచి చిన్నారులు, పెద్దవారు కృష్ణ పర్యవేక్షణలో పాల్గొని ప్రశంసా పత్రాలు సాధించారు. భవిష్యత్తులో జరిగే మరిన్ని అంతర్జాతీయ పోటీలకి పిల్లలకి శిక్షణ నుంచి వారిని గ్లోబల్ ప్లాట్ ఫామ్ కి పరిచయం చేయడమే తన లక్ష్యమని కృష్ణ




తెలిపారం. అంతర్జాతీయ ప్రశంసా పత్రాలు అందుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు చాలా సంతోష పడి కృష్ణ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



### వరి, పత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

**గంగాధర, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** గంగాధర మండలంలోని గంగాధర, మల్లాపూర్, వెంకంపల్లి, బూరుగుపల్లి గ్రామాలలో శుక్రవారం వ్యవసాయ అధికారులు మరియు శాస్త్రవేత్తల బృందం వరి, పత్తి పంటలను పరిశీలించింది. పంటలలో తెల్లదోమ, తామర పురుగుల ఉధృతిని నివారించేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన మందుల వివరాలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ పి. రవి, కే. రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి భత్రు నాయక్, చొప్పదండి ఏడీఏ ప్రియదర్శిని మరియు ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



### ప్రభుత్వ వైద్య శిబిరానికి విశేష స్పందన

**గంగాధర, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత ప్రభుత్వ వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామంలో జ్వరాలు, బీపీ, మధుమేహం (షుగర్) మరియు వివిధ ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బారాజు ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### మంథని జెడ్ పి హెచ్ ఎస్ లో వైభవంగా బతకమ్మ సంబురాలు



**మంథని, అక్టోబర్ 09 (ప్రజాజ్యోతి):** మంథని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో పండగను ముందస్తుగా జరిపారు. ఈ సందర్భంగా రంగురంగుల పువ్వులతో అందంగా బతుకమ్మ నీ పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ ఆట ఆడి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత మాట్లాడుతూ పువ్వులతో పూజించే పెద్ద పండుగ అని, తెలంగాణలో మహిళలు జరుపుకునే అతిపెద్ద పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ, దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శ..

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా..

**ముత్తారం, అక్టోబర్ 09 ప్రజాజ్యోతి** మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాంసాని సమ్మయ్య సోదరి పెంచాల సరోజన ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మండల రాజమ్మ, కలవేన మొగిలి మృతితో వారి కుటుంబాలను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ముత్తారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాట్ల పోషాలు, బండ సత్తమ్మ, తూముల కొమురెల్లి, పరికిపండ్ల రాజలింగు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించడం మానవీయ బాధ్యతగా భావిస్తు పుట్ట మధూకర్ ఆయా కుటుంబాలను కలిసి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల బి.ఆర్ఎస్ అధ్యక్షుడు పోతి పెద్ది కిషన్ రెడ్డి, మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, మాజీ వైస్ ఎంపీపీ ప్రస్తుత గ్రామ సర్పంచి సుధాటి



రవీందర్రావు, మాజీ పి.ఎస్సీ ఎస్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు నూనె కుమార్, మాజీ డైరెక్టర్లు రమణారెడ్డి నాంసాని సమ్మయ్య, చల్ల సమ్మయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రినిటీ విద్యాసంస్థల్లో వైభవంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**పెద్దపల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పెద్దపల్లి ట్రినిటీ బి.ఈడీ కళాశాల, కరీంనగర్ ట్రినిటీ సీబీఎస్ఈ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పూలను పూజించే విశిష్టమైన బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, మన సంస్కృతీసంప్రదాయాలను భావితరాలకు అందించడంలో విద్యాసంస్థలు



కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అనంతరం రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు, ఉపాధ్యాయినులు సంప్రదాయ దుస్తుల్లో ఆడిపాడి, కోలాటాలతో సందడి చేసిన ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

## వివిధ పాఠశాలల్లో ముందస్తు వేడుకలు ఆటపాటలతో సందడి

**బుగ్గారం అక్టోబర్ 09(ప్రజాజ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, మండల విద్యాధికారి మోహన్రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తంగేడు, గునుగు తదితర పూలతో బతుకమ్మలను అలంకరించి సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో రవిప్రసాద్, మనోహర్, అశోక్, శ్రీనివాస్, విజయలక్ష్మి, కృష్ణకుమారి, అతియా కౌసర్, అరుణ్కుమార్, సీఆర్పీ పురుషోత్తం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### కళ్యాణి పాఠశాలలో కోలాహలం

బుగ్గారం మండల కేంద్రంలోని కళ్యాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలోనూ ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు స్వయంగా తంగేడు పూలను తీసుకొచ్చి బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ పాటలు పాడుతూ ఆటలాడి సందడి చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలతో మార్మోగింది. తెలంగాణలో బతుకమ్మకు విశిష్ట స్థానం ఉందని, ఈ పండుగ ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎండీ అబ్దుల్ రహమాన్, ప్రిన్సిపాల్ మల్యాల గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ మద్దెల శ్వేత, ఇన్ఛార్జి కప్పల మహేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఇందుర్తి ఆక్స్ఫర్డ్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



**చిగురు మామిడి/అక్టోబర్ 09, ప్రజా జ్యోతి**
చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి ఉయ్యాల పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అప్పాల సమ్మయ్య మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నదనీ ,ప్రకృతిలోని పూలతో గౌరీ దేవిని అలంకరించి తొమ్మిది రోజులపాటు పూజించి చెరువులో నిమజ్జనం చేస్తారనీ, దీని వలన చెరువులోని నీరు పరిశుభ్రమవుతోంది అని ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా కేవలం తెలంగాణలో మాత్రమే జరుపుకునే పండుగ ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ పండుగ అని పిల్లలకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కూన సంపత్ మరియు ఉపాధ్యాయులు శైలజ. మంజుల. సంధ్య. షాజహాన. మౌనిక. సుస్మిత. అఖిల. రమ్య. జరీనా బేగం. శిరీష. రాధిక. ఎలిజబెత్ లక్రా. మాన్సి సమద్. సోనాలి బార్ల మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో డీఈఓ రాము ఆకస్మిక తనిఖీ

- బతుకమ్మలతో ఘన స్వాగతం పలికిన విద్యార్థినులు..
- ఎఫ్ఎల్ఎన్ అమలుపై డీఈఓ సమీక్ష



**బీర్ పూర్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**
జగిత్యాల జిల్లా విద్యాశాఖాధికారి రాము శుక్రవారం బీర్ పూర్ మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ జీపీ బీర్ పూర్, ఎంపీపీఎస్ ఇంద్రనగర్ కాలనీ, మరియు జెడ్పీహెచ్ఎస్ నరసింహులపల్లి పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలలకు చేరుకున్న జిల్లా విద్యాశాఖాధికారికి విద్యార్థినులు ముందస్తు బతుకమ్మలు, రంగురంగుల పూల అలంకరణలతో సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. విద్యార్థుల ఉత్సాహాన్ని, వారిలోని సాంస్కృతిక ప్రతిభను డీఈఓ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన పాఠశాలల్లో 'ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన' అమలు తీరును నిశితంగా పరిశీలించారు. నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల చదవడం, రాయడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను స్వయంగా పరీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా సాధించాలని, విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని డీఈఓ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగభూషణం, ఉపాధ్యాయులు, సీఆర్పీలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి పీహెచ్‌డీ పట్టా



**జగిత్యాల, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**
జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో రాజనీతి శాస్త్రం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న యస్మీన్ సుల్తానా పీహెచ్‌డీ పట్టా పొందారు. రాజస్థాన్‌లోని ప్రసిద్ధ సన్‌రైజ్ విశ్వవిద్యాలయం నుండి ఆమె ఈ డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. యస్మీన్ సుల్తానా భారతదేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల యువజన విభాగాల పాత్రపై ఒక అధ్యయనం) అనే అంశంపై సుదీర్ఘ పరిశోధన చేశారు. పాలనా అంశాలు, రాజకీయ రంగంలో యువత పోషిస్తున్న పాత్ర, వారి ప్రభావంపై ఆమె చేసిన పరిశోధనకు గాను విశ్వవిద్యాలయం ఈ పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ సాధించినందుకు గాను కళాశాల ప్రిన్సిపల్ కల్వకుంట్ల రామక్రిష్ణ, ఇంచార్జి ప్రిన్సిపల్ డా. ప్రమోద్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ జి. చంద్రయ్య ఆధ్వర్యంలో ఆమెను కళాశాలలో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగాధిపతి డా. ఎస్. మల్లికార్జున్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డా. సంగీతతో పాటు అధ్యాపకులు డా. వరప్రసాద్, డా. వాసవి, నీరజ, డా. శ్రీలత మరియు ఇతర అధ్యాపక బృందం పాల్గొని యస్మీన్ సుల్తానాకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా కళాశాల అధ్యాపకురాలికి పీహెచ్‌డీ రావడం పట్ల కళాశాల వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.



# ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**ఎండపల్లి, అక్టోబరు 9, ప్రజాజ్యోతి:**
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు చందూరి రాజిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పూలతో బతుకమ్మలను పేర్చి గౌరీదేవిని పూజించే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ జానపద కళాకారిణి చుంచు నాగవ్వ ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. రమాదేవి, ఆర్. మాలతి, వి. ప్రశాంత్, ఎన్. నరేష్ కుమార్, కె. కృష్ణారెడ్డి, పూర్వ ప్రాథమిక విద్యా శిక్షకురాలు శ్రీలత, ఎ. శిరీషతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శ,

**ఎండపల్లి, అక్టోబరు 9, ప్రజా జ్యోతి**
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు రావు హన్మంతరావు తండ్రి నారాయణరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హన్మంతరావుతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి మనోధైర్యం కల్పించారు. నారాయణరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన కొప్పుల శేఖర్ ఇటీవలే ప్రమాద వశాత్తూ విద్యుత్ షాక్ తో మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు ప్రగాఢ సానుభూతి తెలిపి,మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు, ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విజ్డమ్ విద్యాభారతిలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



కొడిమ్యాల, అక్టోబర్ 9, (ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని విజ్డమ్ విద్యాభారతి పాఠశాలలో గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తంగేడు, గునుగు, బంతి పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విజ్ఞప్తికి



## స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ఎస్ఆర్ఎస్పీ నుంచి సాగునీరు విడుదలకు ఆదేశాలు

కోరుట్ల, అక్టోబర్ 09 ప్రజాజ్యోతి కోరుట్ల నియోజకవర్గంతో పాటు జగిత్యాల జిల్లా రైతుల సాగునీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలిసి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) నుంచి పంటలకు సాగునీరు విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన మంత్రి, ఇరిగేషన్ శాఖ ఈఎన్సీకి నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ రమేష్తో మాట్లాడి, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## మల్లన్నపేటలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

గొల్లపల్లి, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం మల్లన్నపేట గ్రామంలోని 4వ, 8వ వార్డుల్లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గ్రామ సర్పంచ్ సిద్దెంకి లక్ష్మి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ ముత్యాల స్వామి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందించడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ లైట్లను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. వార్డుల్లో హైమాస్ట్ లైట్ల ప్రారంభంతో తమకు చీకటి సమస్య తీరిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయగా, ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గాధం సంధ్య, మద్దెల శైలజ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జగిత్యాల అభివృద్ధి కి కట్టుబడి ఉన్నా

- సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి ది అనవసర రాద్ధాంతం
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల ప్రతినిధి,అక్టోబర్9 (ప్రజాజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, అనవసరంగా రాజకీయం చేయడం తగదని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. జగిత్యాల ప్రెస్ క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీనియర్ నాయకుడు జీవన్రెడ్డి, సీఎం రేవంత్రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్కుమార్లపై పరుష పదజాలంతో విమర్శలు చేయడం సరికాదన్నారు. 2008లో కొనుగోలు చేసిన నూకపల్లి ఇందిరమ్మ ఇళ్ల స్థలంలో నిర్మాణాలు చేపట్టకపోగా, 2018లో కేటీఆర్ రాకతోనే డబుల్ బెడ్రూం ఇళ్ల పనులు ఊపందుకున్నాయని తెలిపారు. మెడికల్ కాలేజీ డిసెంబరులో ప్రారంభించేలా పనులు వేగవంతం చేస్తున్నామని, జీవన్రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అదనపు నిధులు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయించినట్లు తెలిపారు.

### ఎక్కడైనా చర్చకు సిద్ధం: డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య మాట్లాడుతూ.. జగిత్యాల అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులతో ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. గత బీఆర్ఎస్ హయాంలో మెడికల్ కాలేజీకి 120 కోట్లకు గాను కేవలం 14 కోట్లే కేటాయించారని ఆరోపించారు. రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష విషయంలో సంయమనం పాటించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ చైర్మన్ అడువల జ్యోతి, కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, గట్టు సతీష్, దుమల రాజ్ కుమార్, కుసరి అనిల్, బీరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ బీర్ పూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు





- 62 మంది విద్యార్థినులకు కోలలు పంపిణీ చేసిన ఎంఈఓ సిరూప నాగభూషణం
- పండుగ విశిష్టతను వివరించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు జూపాక సుదర్శన్

బీర్ పూర్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి): బీర్ పూర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు మండల విద్యాధికారి సిరూప నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ మాట్లాడుతూ.. పీఎం శ్రీ పథకంలో భాగంగా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, మరియు చరిత్రను ప్రతిబింబించే అతిపెద్ద పండుగ అయిన బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి ఎంఈఓ సిరూప నాగభూషణం చేతుల మీదుగా పాఠశాలకు చెందిన 62 మంది విద్యార్థినులకు బతుకమ్మ ఆటలు ఆడుకోవడానికి 62 జతల కోలలను పంపిణీ చేశారు. సంబరాల్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు మెమెంటోలను బహుమతిగా అందించి అభినందించారు. విద్యార్థులంతా సాంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మల చుట్టూ చేరు చేరి ఉత్సాహంగా, సంతోషంగా పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. వేడుకల అనంతరం విద్యార్థులందరికీ వివిధ రకాల సద్దిపిండి, మిఠాయిలను పంపిణీ చేశారు. కాగా, దసరా సెలవుల సందర్భంగా విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా అన్ని సబ్జెక్టులకు సంబంధించిన హోంవర్క్ను ఉపాధ్యాయులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ బీర్ పూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చెరుకు శ్రీనివాస్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ సముద్రాల శ్రీలత, ఉపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య, ధరణి మంజుల, మ్యాన రమాదేవి, భోగ నాగరాణి, బాణవత్ స్వరూప, కందుకూరి లలిత, గంధం ప్రియ, షేక్ రజియా, ఐసీటీ శ్రీకాంత్, గంగిపల్లి మౌనిక, వంట సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.